## పదవ పాఠం | الدرس العاشر

### విశ్వాసం దాని మూలస్తంభాలు | الإيمان وأركانه

విశ్వాసం: మనసా, వాచ, కర్మ మూడు రూపాల్లో ఉంటుంది. అది సత్కార్యాలతో పెరుగుతుంది, దుష్కార్యాలతో తరుగుతుంది.

మనసా అంటే విశ్వాసం, సత్యపరచడం,లొంగిపోవడం, చిత్తశుద్ధి, విధేయత మరియు ప్రేమించడం (అల్లాహ్ ను, ఆయన ప్రవక్తను, వారి ఆదేశాలను).

వాచ అంటే సాక్ష్యం పలకడం, జిక్ర్, ఖుర్ఆన్ తిలావత్ చేయడం.

కర్మ అంటే అల్లాహ్ ఆదేశించిన వాటిని ఆచరించడం, వారించిన వాటిని వదులుకోవడం.

## విశ్వాస మూలస్తంభాలు

విశ్వాసానికి ఆరు మూలస్తంభాలున్నాయని ఖుర్ఆన్ మరియు సహీ హదీసుల ద్వారా రుజువైనది. అవి: (1) అల్లాహ్ ను, (2) ఆయన దూతలను, (3) ఆయన గ్రంథాలను, (4) ఆయన ప్రవక్తలను, (5) ప్రళయదినాన్ని, (6) మంచి, చెడు తక్దీర్ (విధివ్రాత)లను విశ్వసించడం. వీటిలోని కొన్ని ఈ క్రింది ఆయతులో ప్రస్తావించబడినవి:

﴿آمَنَ الرَّسُولُ بِمَا أُنْزِلَ إِلَيْهِ مِنْ رَبِّهِ وَالْمُؤْمِنُونَ كُلٌّ آمَنَ بِاللهِ وَمَلَائِكَتِهِ وَكُتُبِهِ وَرُسُلِهِ لَا نُفَرِّقُ بَيْنَ أَحَدٍ مِنْ رُسُلِهِ وَقَالُوا سَمِعْنَا وَأَطَعْنَا غُفْرَانَكَ رَبَّنَا وَإِلَيْكَ الْمَصِيرُ﴾ [البقرة:٢٨٥]

**{తన ప్రభువు తరఫున అవతరింపజేయబడిన దానిని ప్రవక్త విశ్వసించారు. దానిని విశ్వాసులు కూడా విశ్వసించారు. వారంతా అల్లాహ్‌ను, ఆయన దూతలను, ఆయన గ్రంథాలను, ఆయన ప్రవక్తలనూ విశ్వసించారు. "మేము ఆయన ప్రవక్తల మధ్య ఎలాంటి విచక్షణను, భేదభావాన్నీ పాటించము" (అని వారు అంటారు). "మేము విన్నాము. విధేయులం అయ్యాము. మా ప్రభూ! మేము నీ క్షమాభిక్షను అర్థిస్తున్నాము. కడకు మేము మరలి రావలసింది నీ వద్దకే" అని అంటారు.}. (బఖర 2: 285).**

సహీ ముస్లిం హదీసు గ్రంథంలో ఉంది: అమీరుల్ మోమినీన్ హజ్రత్ ఉమర్ బిన్ ఖత్తాబ్ రజియల్లాహు అన్హు ఉల్లేఖించారు: జిబ్రీల్ అలైహిస్సలాం ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లంతో విశ్వాసం (ఈమాన్) అంటేమిటి అని అడిగారు. దానికి ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఇలా జవాబిచ్చారు: "విశ్వాసం అంటే నీవు ①అల్లాహ్ ను, ఆయన ②దూతలను, ఆయన ③గ్రంథాలను, ఆయన ④ప్రవక్తలను, ⑤పరలోకదినాన్ని మరియు ⑥మంచి చెడు తక్దీర్ లను విశ్వసించుట". (ముస్లిం 8).

ఈ ఆరు విషయాలే సత్యవిశ్వాసం యొక్క మూలస్తంభాలు. వీటిని తీసుకొని ఖుర్ఆన్ అవతరించింది, వాటిని తీసుకొనే ప్రవక్త ముహమ్మద్ ﷺ వచ్చారు. వీటినే విశ్వాస మూలస్తంభాలు (అర్కానె ఈమాన్) అంటారు.